# అభివృద్ధే నా ఎజెండా

- రాష్ట్రంలో జిల్లాను ముందు వరుసలో నిలపాలన్నదే లక్ష్యం
- వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
- బీఆర్ఎస్‌లో చేరిన వనపర్తి, పెద్దమందడి మండలాలకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు



వెల్టూర్‌లో మంత్రి నిరంజన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న బీజేపీ, కాంగ్రెస్ నాయకులు

పెద్దమందడి, అక్టోబర్ 30 : రాష్ట్రంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న జిల్లాల లిస్ట్‌లో వనపర్తిని ముందు వరుసలో నిలపాలన్నదే తన ఎజెండాగా పెట్టుకొని పని చేస్తున్నానని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. పెద్దమందడి మండలంలోని వెల్టూరు గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు కృష్ణారెడ్డి, భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో 30మంది బీజేపీ, కాంగ్రెస్ నాయకులు సోమవారం మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ముందుగా మంత్రి వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లా ఏర్పాటు చేసిన నాటి నుంచి ఇప్పటి వరకు ఎన్నో అభివృద్ధి పనులు చేశామని, ప్రజలందరూ ఆశీర్వదిస్తే మరిన్ని అభివృద్ధి పనులు చేస్తానన్నారు. జిల్లా అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. రాష్ట్రం ఏర్పాటుకు ముందు జిల్లా అభివృద్ధిలో వెనుకబడి ఉండేదని, ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటయ్యాక సీఎం కేసీఆర్ సహకారంతో విద్య, వైద్యం, వ్యవసాయం, క్రీడలు, రోడ్లు తదితర వాటిని మెరుగుపర్చుకున్నామని పేర్కొన్నారు. నూతన దవాఖానలు, కళాశాలలు, నియోజకవర్గానికి సాగునీరు తీసుకొచ్చామని తెలిపారు. జిల్లా అభివృద్ధే లక్ష్యంగా పనిచేశానని, రానున్న ఎన్నికల్లో ప్రజలు ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ గెలుపునకు ప్రతి కార్యకర్త శక్తివంచన లేకుండా కృషి చేయాలని కోరారు. ప్రతి కార్యకర్తకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, పార్టీలో అందరూ సమన్వయంతో పనిచేస్తూ ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను, మ్యానిఫెస్టోను వివరించాలన్నా రు. కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా అ ధ్యక్షు డు జగదీశ్వర్‌రెడ్డి, జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు రాజాప్రకాశ్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ వెంకటయ్య, గ్రామ రైతు కమిటీ అధ్యక్షుడు చిన్న రఘువర్ధన్‌రెడ్డి, చిత్తూరు కృష్ణారెడ్డి, గొంది భాస్కర్‌రెడ్డి, గట్లకానాపురం సర్పంచ్ కోట్ల వెంకటేశ్, చిట్టిబాబు, నాయకులు, కార్యకర్తలు, పార్టీలో చేరిన వారు ఉన్నారు.

### పనిచేస్తే ప్రజలు గుండెల్లో పెట్టుకుంటారు

వనపర్తి, అక్టోబర్ 30 : ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, వందశాతం అభివృద్ధికి పునాదులు వేశానని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. మంత్రి నివాసంలో జిల్లా కేంద్రంలోని 4 వవార్డుకు చెందిన మునికుమార్, బాలరాజు ఆధ్వర్యంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన 30మంది యువకులు, మహిళలు సోమవారం మంత్రి నిరంజన్‌రెడ్డి సమక్షంలో గులాబీ కండువాలు కప్పుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తొమ్మిదిన్నరేండ్లుగా ప్రజలకు ఏమీ కావాలో గ్రహించి అభివృద్ధి పనులు చేసుకుంటూ వచ్చామన్నారు. పనిచేస్తే ప్రజలు గుండెలో పెట్టుకుంటారన్న దానికి ఈ చేరికలే నిదర్శమన్నారు. పట్టణంతోపాటు చుట్టూ ఉన్న గ్రామాలను కూడా పట్టణ స్థాయిలో అభివృద్ధి చేశామన్నారు. వనపర్తిని జిల్లాగా సాధించుకోవడంతో పట్టణాభివృద్ధికి శరవేగంగా విస్తరించిందని, అందుకు తగ్గట్టుగా అభివృద్ధి కార్యక్రమాలకు పునాదులు వేశామన్నారు. పట్టణంలోని యువత ఎక్కడికో వెళ్లి ఉపాధి చేసుకొనే పరిస్థితుల నుంచి నేడు తమ స్థాయికి తగ్గ ఉపాధిని ఇక్కడే చేసుకొనే స్థాయికి వచ్చారన్నారు. ఎన్నికలు ఐదేండ్లకు ఒకసారి వస్తుంటాయి, కానీ చేసిన అభివృద్ధి ఎప్పటికీ నిలిచిపోతుందని, అది ఎప్పుడూ ప్రజల కండ్ల ఎదుట ఉంటుందని, అది చేసిన వారిని ప్రజలు గుండెల్లో పెట్టుకుంటారని తెలిపారు. 30 ఏండ్లుగా నాయకులు వారి స్వలాభం, ఓట్ల కోసం జిల్లా కేంద్రంలో రోడ్డు వెడల్పు పనులు చేపట్టలేకపోయారన్నారు. తాను రోడ్ల వెడల్పు పనులు చేయించేటప్పుడు చాలా మంది వచ్చే ఎన్నికల్లో ఇబ్బందులు పడుతారని గుర్తు చేశారు. అయినా వాటిన్నింటినీ లెక్క చేయకుండా రోడ్ల వెంట ఇండ్లు కోల్పోతున్నవారితో చర్చించి వారికి న్యాయం చేసే దిశగా వారిని ఒప్పించి రోడ్ల విస్తరణతో పట్టణాభివృద్ధికి దోహదం అవుతుందని, నేను ఓట్ల రాజకీయం చేయడం లేదని వారితో సూటిగా చెప్పడంతో సాధ్యమైందన్నారు. వీటిన్నింటిని ప్రజలు గుర్తించాలని, వచ్చే ఎన్నికల్లో చాలా మంది వాగ్దానాలు చేస్తుంటారు.. మోసపూరిత మాటాలను చెబుతుంటారు. ప్రజలు వాటిని గుర్తించాలన్నారు. మనకండ్ల ముందున్న అభివృద్ధి చూసి వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు భారీ మెజార్టీని అందించాలని కోరారు. పార్టీలోకి వచ్చే వారు, కొత్త, పాత అనే తేడా లేకుండా పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. గెలిపించే బాధ్యత మీది..వనపర్తి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసే బాధ్యత తనదని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, మార్కెట్ చైర్మన్ రమేశ్ గౌడ్, కౌన్సిలర్లు బండారు కృష్ణ, కోఆప్షన్ సభ్యులు ఇమ్రాన్, రాము, రామస్వామి, సతీశ్ కుమార్, శివకుమార్, వెంకటేశ్, విజయ్, యాదగిరి, శ్రీకాంత్, భీమ్ నాయక్, రమేశ్, దశరథమ్మ, అంజలి, సుజాత తదితరులు పాల్గొన్నారు.



మంత్రి నిరంజన్‌రెడ్డికి మద్దతు తెలుపుతున్న ఎర్రగడ్డ తండావాసులు

## మంత్రి నిరంజన్‌రెడ్డికే మా మద్దుతు

- తీర్మానం చేసిన ఎర్రగడ్డ తండావాసులు

పెద్దమందడి, అక్టోబర్ 30: మండలంలోని బలిజపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ఎర్రగడ్డతండా వాసులు సోమవారం సమావేశం ఏర్పాటు చేసుకొని మంత్రి నిరంజన్ రెడ్డికి సంపూర్ణంగా మద్దుతు ఇస్తామని తీర్మానం చేశారు. ఈ సమావేశానికి బలిజపల్లి సర్పంచ్ డాక్టర్ జయంతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. సమావేశంలో ఉపసర్పంచ్ నాగేశ్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు సంజీవరెడ్డి, పానుగంటి రాజు, తండావాసులు చంద్రు, ఈశ్వర్, నానూనాయక్, కృష్ణ, శంకర్, రవీందర్, నర్సింగ్, రాంచందర్, రవి, సువాలి, లక్ష్మి ఉన్నారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, ఇతర అధికారులు

## నామినేషన్ స్వీకరణ ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలి

- అక్టోబర్ 31 వరకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి
- రాష్ట్ర ఎన్నికల అధికారి నితీశ్ వ్యాస్
- సమస్యల పరిష్కారానికి కంట్రోల్ రూం ఏర్పాట్లు
- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

వనపర్తి, అక్టోబర్ 30 : నవంబర్ 3 వ తేదీ నుంచి నామినేషన్‌ల స్వీకరణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కేంద్ర ఎన్నికల కమిషన్ సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీశ్ వ్యాస్ జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. సోమవారం న్యూఢిల్లీ నుంచి తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎలక్టోల్ అధికారి వీసీ ద్వారా ఎన్నికల నిర్వహణ పై దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో నవంబర్ 3న ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేస్తారని, అదేరోజు నుంచి అభ్యర్థుల నుంచి నామినేషన్ల స్వీకరణ ఉంటుంది కాబట్టి అందుకు అవసరమైన అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. 100 మీటర్లలో హద్దులు ఏర్పాటు చేసుకోవడం, అవసరమైన పోలీస్ బందోబస్తు తదితర ఏర్పాట్లు పకడ్బందీగా చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ సువిధ యాప్ ద్వారా నామినేషన్ వేసే అభ్యర్థులకు తగిన సాంకేతిక పరిజ్ఞానం, సహకారం అందించే విధంగా చూసుకోవాలన్నారు. సరైన సమయాన్ని సూచించే గోడ గడియారం పెట్టుకోవాలని తెలిపారు. అభ్యర్థులపై ఉన్న క్రిమినల్ కేసుల వివరాలు ఏమైనా ఉంటే వాటిని కేవైసీ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని, తద్వారా ప్రజలందరూ తెలుసుకునే విధంగా యాప్‌ను రూపొందించినట్లు తెలిపారు. అభ్యర్థులకు ఎన్నికల ప్రచార వ్యయం, నిర్వహణకు సంబంధించిన ప్రత్యేక బ్యాంక్ అకౌంట్ తెరిపించాలని సూచించారు. నూతన ఓటర్లగా పేర్లు నమోదు చేసుకోవడానికి అక్టోబర్ 31 చివరి తేదీ అని వచ్చిన అన్ని దరఖాస్తులను పరిశీలించి అర్హులందరికీ ఓటరు జాబితాలో పేరు చేర్చడమే కాకుండా ఎపిక్ కార్డులు ముద్రించి పంపించాలని తెలియజేశారు. నవంబర్ 10తర్వాత ఓటరు స్లిప్పులు ఓటర్లుకు అందించేవిధంగా కార్యాచరణ చేసుకోవాలన్నారు. నామినేషన్లు ఉపసంహరణ అనంతరం పోస్టల్ బ్యాలెట్‌లు, బ్రెయిలీ లిపి బ్యాలెట్‌లు అవసరమైన మేరకు ముద్రించి ఎన్నికల విధులు నిర్వహించే వారికి పోస్టల్ బ్యాలెట్‌లు విధుల నిర్వహించే సెంటర్‌లో ఓటు తీసుకొని వేసేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. హోమ్ ఓటింగ్‌కు సంబంధించి తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సీజర్ కమిటీకి సంబంధించి ప్రజల నుంచి ఎక్కువ ఫిర్యాదులు రాకుండా పారదర్శకతతో పట్టుకున్న నిధులు, ఆభరణాలను సీజ్ చేయాలన్నారు. ఎన్నికల్లో ప్రలోభ పెట్టేందుకు తరలించే నిధులు ఎక్కడ దొరికినా పకడ్బందీగా సీజ్ చేయాలన్నారు. వీసీలో పాల్గొన్న కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ మాట్లాడుతూ నామినేషన్లు స్వీకరణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులు వస్తే 24 గంటల్లో పరిష్కరిస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఎక్కడా ఎలాంటి సమస్య ఉత్పన్నమైనా నిమిషాల వ్యవధిలో చేరుకొని పరిష్కరించే విధంగా సమీకృత కంట్రోల్ రూం ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్పీ రక్షితాకృష్ణమూర్తి, వనపర్తి రిటర్నింగ్ అధికారి అదనపు కలెక్టర్ తిరుపతిరావు, నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం కేసీఆర్‌తోనే అభివృద్ధి సాధ్యం

- కాంగ్రెస్ గ్యారెంటీలను నమ్మొద్దు
- కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి
- కోడేరులో ఆత్మీయ సమ్మేళనం

కోడేరు, అక్టోబర్ 30 : తెలంగాణ ప్రజల ఎజెండానే బీఆర్ఎస్ ఎజెండా అని, పేదల అభివృద్ధి, సంక్షేమం కోసం నిరంతరం పరితపించే నాయకుడు సీఎం కేసీఆర్ అని కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలకేంద్రంలో బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనాన్ని పార్టీ మండలాధ్యక్షుడు రాజశేఖర్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బీరం మాట్లాడుతూ కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో ప్రజల ఎజెండానే బీఆర్ఎస్ పార్టీ ఎజెండా అని, పేదల ఆలోచనలకు అనుగుణంగా ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందే విధంగా రూపకల్పన చేసి ఆచరణలో అమలు చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. తొమ్మిదేండ్ల కేసీఆర్ పాలనలో రాష్ట్రం దేశంలోనే నెంబర్‌వన్‌గా గుర్తింపు పొందిందన్నారు. రెండేళ్లు కరోనా మహమ్మారి ప్రజలను పీడించినా రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలను నిలుపుదల చేయకుండా అమలు చేసిన ప్రభుత్వం మన తెలంగాణ ఒక్కటేనని వెల్లడించారు. కరోనా కాలంలో కనబడని కొందరు ప్యారాచూట్ నాయకులు ఎన్నికలు వచ్చేసరికి అధికారం కోసం పాకులాడుతున్నారని విమర్శించారు. ఇన్నాళ్లు బీఆర్ఎస్ పార్టీలో ఉంటూ అధికారాన్ని అనుభవించి కేసులు పెట్టి జైలుకు పంపిన వాళ్లు పెట్టే ప్రలోభాలకు లొంగి కొందరు బయటికి వెళ్తున్నారని వాళ్లు 100 మందిని తీసుకెళ్తే మనం వెయ్యి మందిని చేర్చుకుంటామన్నారు. ప్రలోభాలకు లొంగి పార్టీ మారే నాయకులకు ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో కొల్లాపూర్ ప్రాంతం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నదన్నారు. జాతీయ రహదారి, సోమశిల సిద్ధేశ్వరం వంతెన, ఉద్యావన కళాశాల, పాలిటెక్నికల్ కళాశాల, మామిడి మార్కెట్, డయాలసిస్ సెంటర్, ఎస్సీ, బీసీ, మైనార్టీ గురుకుల పాఠశాలలు, రెవెన్యూ కార్యాలయాలు వంటి అభివృద్ధి పథకాలు మంజూరయ్యాయని గుర్తు చేశారు. 18 ఏండ్లు కొల్లాపూర్‌ను పరిపాలించిన ప్యారాచూట్ నాయకుడు మాజీ మంత్రి జూపల్లి ఏం అభివృద్ధి చేశారో ప్రజలు నిలదీయాలని సూచించారు. మంత్రిగా ఉండి కొల్లాపూర్ ప్రాంతాన్ని ఎలాంటి అభివృద్ధి చేయకుండా నిర్లక్ష్యం చేసినందుకే గత ఎన్నికల్లో ప్రజలు ఓడించారన్నారు. అయినా నాలుగున్నర ఏండ్లపాటు అధికార పార్టీలో ఉండి పార్టీ నాయకులు, కార్యకర్తలను మోసం చేసి నేడు కాంగ్రెస్‌లో చేరారని విమర్శించారు. కర్ణాటక రాష్ట్రంలో కాంగ్రెస్ అమలు చేస్తున్నట్లుగానే తెలంగాణలో కూడా అమలు చేస్తామని చెబుతున్న కాంగ్రెస్ నేతలు కర్ణాటకలో 5గంటల కరెంటు కూడా సక్రమంగా ఇవ్వడం లేదని, మూడు గంటలు కరెంట్ ఇచ్చే పార్టీ కావాలా? 24 గంటలు ఉచితంగా కరెంట్ ఇస్తున్న బీఆర్ఎస్ కావాలో ప్రజలు, రైతులు ఆలోచించుకోవాలని సూచించారు. మోసపోతే గోసపడతామని, అభివృద్ధి కోసం పరితపించే నాయకులకు ప్రజలు అండగా నిలబడి ఆశీర్వదించాలని బీరం పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రంగినేని అభిలాష్ రావు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు దూరెడ్డి రఘువర్ధన్ రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాజశేఖర్‌గౌడ్, విండో చైర్మన్లు చిన్నారెడ్డి, కృష్ణారెడ్డి, రుక్మారెడ్డి, సీనియర్ నాయకులు బుచ్చారెడ్డి, విండో డైరెక్టర్లు జగన్మోహన్‌రెడ్డి, నరసింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కిషన్ నాయక్‌తోపాటు పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీరం